

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్





నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట


శుక్రవారం, జూన్ 26, 2026 పేజీలు : 8


# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు

– జిల్లా స్థాయి రోడ్డు భద్రత, ఎన్‌కార్డ్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునితా రెడ్డి



2 లో




# సీజ్‌లు, హెచ్చరికలు బేఖాతరు.

**–అక్రమ నిర్మాణం మళ్లీ యథేచ్ఛగా..!**
**– నిబంధనలను తుంగలో తొక్కిన నిర్మాణదారులు**
**– అడ్డుకున్న ఏసీపీ జ్యోత్స్నకు వేదింపులా..?**

**మహబూబ్‌నగర్, జూన్ 25**
**( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ నగరంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేసిన భవనంలోనే మళ్లీ నిర్మాణ పనులు కొనసాగడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అధికారుల హెచ్చరికలు, సీజ్ ఆదేశాలు, చట్టపరమైన చర్యలను బేఖాతరు చేస్తూ నిర్మాణదారులు మరోసారి పనులు చేపట్టినట్లు సమాచారం.అధికారికంగా సీజ్ చేసిన నిర్మాణ ప్రాంతంలో పనులు కొనసాగుతున్నాయని సమాచారం అందడంతో మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ జ్యోత్స్న సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే ఆమె విధి నిర్వహణలో అడ్డంకులు సృష్టించడమే కాకుండా, మహిళా అధికారి అన్న గౌరవం కూడా లేకుండా ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే ఈ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చర్యలు తీసుకున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా తిరిగి పనులు ప్రారంభించడం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టాన్ని ధిక్కరించే ధైర్యం నిర్మాణదారులకు ఎలా వచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన సమయంలో అధికారుల ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘించడం, సీజ్ చేసిన భవనంలోనే పనులు కొనసాగించడం మున్సిపల్ పరిపాలన ప్రతిష్ఠకు సవాల్‌గా మారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

- మిగతా 2లో..

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన

# పేదలకు అందాలి

– ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలి : ఎం. దాన కిశోర్




**మహబూబ్‌నగర్, జూన్ 25**
**( ప్రజా జ్యోతి బ్యూరో )**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరవేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలు, సమస్యల పరిష్కారానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఫలితాల దిశగా ముందుకు సాగాలని జిల్లా ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి

# రూ.42 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన

– జడ్చర్ల యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు నూతన దిక్సూచి



# ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలి

కార్మిక,ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి హరిచందన



# ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలి

నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది లేనిది తెలుసుకోవడంతోపాటు, అలాగే వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజులపాటు ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు .ప్రభుత్వ పథకాల ఫలితాలు లబ్ధిదారుల కందాలంటే అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అప్పుడే లబ్ధిదారులకు సరైన విధంగా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం, ప్రభుత్వ పథకాల పై ప్రజల కు అవగాహన కల్పించడం వంటివి అధికారులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నారాయణ పేట జిల్లాలో ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆమె జిల్లా కలెక్టర్ తో పాటు, అధికారులందరినీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే వరవడిని కొనసాగించాలని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు రొటీన్ పనులపై కాకుండా అదే పనిని ఇతర ప్రాంతాలలో ఎలా చేస్తున్నారో అధ్యయనం చేసుకొని సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని ప్రజలకు చేకూర్చేందుకు కృషి చేయాలని, ఇందుకుగాను వినూత్నంగా ఆలోచన చేయాలని తెలిపారు. 99 రోజుల కార్యాచరణ అయిపోయిందని అనుకోకుండా సంవత్సరం పాటు అదే కార్యాచరణతో ముందుగు సాగాలన్నారు. బడిబాట, ఫుడ్ సేఫ్టీ, అరైవ్ అలైవ్ కార్యక్రమాలను ప్రస్తావించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు చాలా జరుగుతుంటాయని, బ్లాక్ స్పాట్ లను గుర్తించి వదిలేయకుండా, నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికా విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎనీమియా సమస్యను అధిగమించాలన్నారు. అంతేకాకుండా ఈ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని, బాల్య వివాహాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని హరిచందన ఆదేశించారు. నారాయణ పేట వ్యవసాయ ఆధారిత జిల్లా అని, సాధారణ పంటలతో పాటు పండ్లు, కూరగాయలు లాంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను చైతన్య పరచాలని ఆమె సూచించారు. అటవీ విస్తీర్ణం కూడా జిల్లాలో తక్కువే నని, విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ ఆలోచనలను, ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నారాయణపేట జిల్లాలో 99 రోజులపాటు ఆయా అంశాల వారిగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారినికి వివరించారు. ఆయా శాఖలకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారినికి వివరించారు.

సమావేశంలో జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఏ వెంకట్ రాములు, సీ పీ వో ఖాఘ వాహన్, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, డీ పీ ఆర్ వో రషీద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు

వనపర్తి ప్రతినిధి, జూన్ 25 (ప్రజాజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత మరియు ఎన్‌కార్డ్ సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ రహదారి–44తో పాటు ఆర్‌అండ్‌బీ రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ల పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారి–44పై కొత్తకోట మదర్ తెరిసా జంక్షన్, పెబ్బేరు బైపాస్, రంగాపూర్ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా కొత్తకోట మదర్ తెరిసా జంక్షన్, రంగాపూర్ లిక్కర్ ఫ్యాక్టరీ సమీపంలో రాంగ్‌రూట్ ప్రయాణాల కారణంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొంటూ, జాతీయ రహదారుల అధికారులకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్, పాత యూకో బ్యాంక్, వివేకానంద చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల సూచిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, డివైడర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర భద్రతా చర్యలను పరిశీలించాలని ఆదేశించారు. వైద్య కళాశాల, కలెక్టరేట్ జంక్షన్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో రహదారుల ఆక్రమణలు, ఫ్లెక్సీల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆదేశించారు. ఎన్‌కార్డ్ సమావేశంలో మాదకద్రవ్యాల నియంత్రణ అంశంపై కూడా చర్చించారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. మెడికల్, డిగ్రీ కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కల్లు, మద్యం దుకాణాల్లో మైనర్లకు మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ అంశాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. నిరంతర నిఘా, తనిఖీల ద్వారా సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని, ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడంతో పాటు కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ బాలాజీ నాయక్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ, పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.42 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన

జడ్చర్ల/రాజాపూర్, జూన్ 25 ( ప్రజా జ్యోతి ) రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలో రూ.42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, జడ్చర్ల నియోజకవర్గ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. రంగారెడ్డిగూడలో ఏర్పాటు కానున్న ఈ కేంద్రం ద్వారా యువతకు సాంకేతిక శిక్షణ, ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యేక మార్గదర్శకత్వం లభిస్తుందని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ కేంద్రం జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువత సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యువత ఉద్యోగాలు పొందడమే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జడ్చర్ల యువత భవిష్యత్తుకు బలమైన పునాది;

రూ.42 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, జడ్చర్లతో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపునివ్వనుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఏటూరు రామకృష్ణ సేవలు అభినందనీయం -ఎమ్మెల్యే




**నాగర్ కర్నూల్ : జూన్ 25 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సుఖజీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన ఏటూరు రామకృష్ణ ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఏటూరు రామకృష్ణ ఘనంగా సన్మానించి ప్రభుత్వ సేవలో ఉండి అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ ఉద్యోగంలో నిబద్ధత,క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథంతో విధులు నిర్వహించి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచారన్నాని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు,మాజీతాలూకా అధ్యక్షుడు హరీష్ గౌడ్ తో పాటు ప్రజా ప్రతినిధులు,అధికారులు,ఉద్యోగులు,కుటుంబసభ్యులు,స్నేహితులు,అభిమానులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# సీజ్‌లు, హెచ్చరికలు బేఖాతరు.

మరోవైపు విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారిని అవమానించేలా ప్రవర్తించారన్న ఆరోపణలు నిజమైతే, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు మాట్లాడుతూ, సీజ్ చేసిన నిర్మాణంలో మళ్లీ పనులు జరుగుతున్నాయంటే ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, చట్టాన్ని బహిరంగంగా సవాల్ చేయడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనపై మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

“సీజ్ చేసినా నిర్మాణం… అడ్డుకుంటే అధికారులకే అవమానం” అనే పరిస్థితి నెలకొనడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఈ వ్యవహారంపై మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలి

ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాన కిశోర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన 10 థీమ్స్ ఆధారంగా వివిధ శాఖలు నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సభల్లో గుర్తించిన సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, పెండింగ్ అంశాలపై శాఖలవారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. నిధులు అవసరం లేని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నిధులు అవసరమయ్యే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని సూచించారు.గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో భవనాల నిర్మాణం చేపట్టి వచ్చే తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్‌తో రహదారుల నిర్మాణం వంటి అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రతి శాఖ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలు, ఉత్తమ పద్ధతులు, వినూత్న కార్యక్రమాలపై 15 రోజుల్లో బుక్‌లెట్ రూపొందించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అనుసరించిన ప్రత్యేక విధానాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో గుర్తించిన అనీమియా, మధుమేహం, మహిళల ఆరోగ్య సమస్యలు, కంటి వ్యాధులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫార్మా సంస్థల సీఎస్ఆర్ నిధుల ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు, కళ్లద్దాలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే బాలికల కోసం వసతి గృహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రహదారి భద్రతకు సంబంధించిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల్లో మరింత మంది పిల్లలను చేర్పించి సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కేవలం 99 రోజుల కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన పురోగతిని సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

# వనపర్తిలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం

**- ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**

**- జూలై 1లోగా పంపిణీ పూర్తి చేయాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ప్రతినిధి, జూన్ 25 (ప్రజాజ్యోతి):**
జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ప్రతి ఓటరుకు ఫారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఫారాలను పూరించే విధానంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ (29వ వార్డు), పెబ్బేరు మున్సిపాలిటీ రెండో వార్డులో జరుగుతున్న ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 1వ తేదీలోపు జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తిచేయాలని సూచించారు. ఫారాల పంపిణీ సమయంలో వాటిని ఎలా పూరించాలో ఓటర్లకు వివరించాలని, అనంతరం ఫారాల సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. బూత్ స్థాయి ఏజెంట్లు కూడా బీఎల్ఓలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జడ్పీ సీఈఓ యాదయ్య, పెబ్బేరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ్‌వర్ధన్ రెడ్డి, తహసీల్దార్లు రమేష్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఎన్నికల శాఖ, మున్సిపల్ అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

**-చిన్నారులకు పోషకాహారం అందించాలి**

**-ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి**






**నాగర్ కర్నూల్ : 25 (ప్రజా జ్యోతి)**
అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన విద్య,పోషకాహారం అందించాలని నాగ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు.గురువారం తాడూరు మండల పరిధిలోని చెర్ల ఇటుక్యాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం,ఆహార నాణ్యతపై ఆరా తీసి పిల్లలకు అందిస్తున్న పాలు,గుడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించి,చిన్నారుల ఆరోగ్యం మరియు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడి అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలు, సౌకర్యాల వివరాలు తెలుసుకుని,చిన్నారులకు మెరుగైన విద్య పోషకాహారం,మంచి వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అంగన్‌వాడీకి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని,చిన్నారుల భవిష్యత్తు బలోపేతానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని, అంగన్వాడీ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అంగన్‌వాడీ సిబ్బంది,పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 25 (ప్రజా జ్యోతి):**
విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మఖ్తల్ ఎస్సై రాజు యాదవ్ విద్యార్థులకు సూచన చేశారు. గురువారం నారాయణపేట జిల్లా మఖ్తల్ జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు డ్రగ్స్,గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు పునాది అని,అలాంటి యువత మత్తు పదార్థాల బారిన పడితే వారి వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం మరియు సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, నేరాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు.విద్యార్థులు తమ లక్ష్యాల సాధన కోసం విద్యపై పూర్తి దృష్టి సారించాలని, చెడు స్నేహాలు మరియు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా లేదా స్నేహితుల ప్రలోభాలకు లోనై ఎటువంటి మత్తు పదార్థాలను వినియోగించరాదని హెచ్చరించారు. డ్రగ్స్ మరియు గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారి స్నేహితులు, రోజువారీ కార్యకలాపాలపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యత పెంపొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి కృషి చేయాలని తెలిపారు.డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్బి) టోల్ ఫ్రీ నంబర్ 1908 అందుబాటులో ఉందని,ఎవరైనా గోప్యంగా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని ఎస్సై నరేష్ పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్స్ అవేర్నెస్ పై ఏర్పాటుచేసిన వాల్పోస్టర్లు లెక్చరర్స్, విద్యార్థులతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై 2 ఆచారి, హెడ్ కానిస్టేబుల్ బలరాం, కానిస్టేబుల్ మహేష్, హోంగార్డ్ శ్రీహరి ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## నల్లపోతుల వివాహ వేడుకలో పాల్గొన్న గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి



**కొల్లాపూర్ జూన్ 25 ప్రజా జ్యోతి**
కొల్లాపూర్ నియోజకవర్గం కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి గ్రామానికి చెందిన నల్లపోతుల కురుమయ్య పార్వతమ్మ ఆహ్వానం మేరకు కూతురు భవ్య ధర్మేష్ వివాహ వేడుకల్లో పాల్గొని వరుడు వధువులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : జూన్ 25(ప్రజా జ్యోతి)**
బిజినపల్లి మండలంలోని శాయిన్ పల్లి గ్రామంలో పోచమ్మతల్లి ప్రతిష్ఠ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడుఉండాలని అమ్మవారి దయతో గ్రామ ప్రజలు సంతోషంగా ఆయురారోగ్యాలతో,పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు బి.ఆర్.ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పైపాడు గ్రామంలో వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.అబ్రహాం

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 25:**
జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామంలో ఏలియా వజ్రముల ఆహ్వాన మేర నిర్వహించిన రాజ్ కుమార్ కవిత వివాహ మహోత్సవానికి గురువారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.అబ్రహాం ముఖ్య అతిథిగా హాజరై వరుని స్వగృహం నందు నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధితో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నాయకులు వధూవరులను అభినందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# జమ్ములమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెబ్బేరు, జూన్ 25 (ప్రజాజ్యోతి):**
గ్రామ దేవతల పండుగలు గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెబ్బేరు మండలం రామాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన జమ్ములమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగలు గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జమ్ములమ్మ అమ్మవారి కృపతో రామాపురం గ్రామంతో పాటు మొత్తం నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు




దయాకర్ రెడ్డి, నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, గ్రామ నాయకులు సత్యనారాయణ రెడ్డి, భగవంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివ--రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ మంత్రుల సందడి

**- కుచ్చుర్‌కల్ గ్రామంలో ఘనంగా ధార్మిక వేడుకలు**

**జడ్చర్ల, జూన్ 25 ( ప్రజా జ్యోతి )**
రాజాపూర్ మండలం కుచ్చుర్‌కల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ శివాలయం, శ్రీరామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవతామూర్తుల దర్శనం చేసుకున్నారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ, ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో దేవాలయాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం, పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు



విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు. ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ

**- రూ. లక్ష విలువైన సామగ్రిని అందించిన బాల త్రిపుర సుందరి**

**జడ్చర్ల, జూన్ 25 ( ప్రజా జ్యోతి )**
సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్)లో చదువుతున్న 250 మంది విద్యార్థులకు సుమారు రూ.1 లక్ష విలువైన స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను గుర్తించి విశాల హృదయంతో స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లను అందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగపడటమే కాకుండా సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని పేద



విద్యార్థుల సంక్షేమం కోసం స్వంత నిధులతో లక్ష రూపాయల విలువైన సామగ్రిని అందించడం గొప్ప మానవతా సేవ అని పలువురు కొనియాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాల త్రిపుర సుందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల మండల అధ్యక్షుడు యాట రామకృష్ణ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, నాయకులు జగదీశ్వర్, రమేష్ జీ, సామల నరసింహులు, లింగం, యాదగిరి, కుమార్, మహేష్, శివ మహేందర్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు తాహెర్, షాహినా పర్వీన్, కృష్ణయ్య, శశిధర్, శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్, ఆంజనేయులు, రవికుమార్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

## సర్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**
**- ఘనంగా 2 కే రన్ ప్రారంభం.**




**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్) లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. చనిపోయిన వ్యక్తుల పేర్లు, డబుల్ ఓట్లను తొలగించడమే సర్ ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 2 కే రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ రన్ పట్టణంలోని సత్య నారాయణ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ 2కే రన్ కు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రియాంక కలెక్టరేట్ ఆవరణ లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఓటర్ల పేర్లు తొలగించేందుకు కాదని, ఓటరు జాబితా మరింత ప్రామాణికంగా రూపొందించేందుకు చేపడుతున్న ప్రక్రియ అని ఆమె తెలిపారు. గురువారం నుంచి వచ్చే నెల 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలోని ప్రతీ ఓటరుకు బూత్ స్థాయి అధికారులు ( బీ ఎల్ వో లు) వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఓటర్లు ఆ ఫారాలు నింపి తిరిగి సమర్పించడం ద్వారా తమ పేరు ఓటరు జాబితాలో కొనసాగుతున్నట్లు నిర్ధారించుకోవాలని సూచించారు. నిజమైన ఓటరు జాబితా తయారు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. 2 కే రన్ లో పాల్గొన్న వారందరికీ ఈ సందర్భంగా ఆమె ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డీఎస్పీ నల్లపు లింగయ్య, కలెక్టరేట్ ఏవో అనిల్, డీ వై ఎస్ వో వెంకటేష్ శెట్టి, డీ పీ ఆర్ వో రషీద్, సీ. ఐ. శివ శంకర్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు



## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

**- జూన్ 26 వరకు దరఖాస్తులు -- జూన్ 28న అర్హత పరీక్ష**
**- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలల కోచింగ్**

**వనపర్తి, జూన్ 25 (ప్రజాజ్యోతి):**
ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డీసీపీ పి. మధుకర్ స్వామి సారథ్యంలో, శ్రీధర్ సీసీఈ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్ పేజీ, యూట్యూబ్ ఛానల్ లేదా ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా జూన్ 24 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 26 రాత్రి 9 గంటల వరకు గడువు ఉంటుందని చెప్పారు. అర్హత పరీక్షను జూన్ 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 47 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు వనపర్తి పరీక్షా కేంద్రంగా ఉంటుందని తెలిపారు. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు సుమారు నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ అందజేస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9542433427 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



# ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల కలలు సాకారం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

## - రామాపురంలో లబ్ధిదారుల గృహప్రవేశాలకు హాజరై నూతన వస్త్రాల పంపిణీ

**వనపర్తి ప్రతినిధి, జూన్ 25 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నిరుపేదల సంక్షేమానికే కట్టుబడి పనిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామీణ పేదల సొంతింటి కల సాకారమవుతోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు మండలం రామాపురం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పద్మ--శివ, సుజాత--వెంటయ్య, పద్మ--శేఖర్, శారద--కురుమన్న, కాశన్న, సుజాత--మహేష్, మంజుల--ఉదయ్, గోవిందమ్మ--సూరి, గోవిందమ్మ--పుట్ట రాములు, ఎండి సుల్తాన్, చెన్నమ్మ--లోకేష్ కుటుంబాలకు ఎమ్మెల్యే నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, సొంత ఇల్లు లేక ఎన్నో సంవత్సరాలు పూరిగుడిసెల్లో, రేకుల షెడ్లలో, మట్టి ఇళ్లలో ఇబ్బందులు పడుతూ జీవించామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక సొంత ఇంటి నిర్మాణం కలగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులను ఆశ్రయించినా తమ సమస్య పరిష్కారం



కాలేదని వాపోయారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడం వల్ల సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, సత్యనారాయణ రెడ్డి, భగవంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగం సాక్షిగా ఆదర్శ వివాహం

### గూడెం గ్రామంలో శివశంకర్--సౌమ్యల వినూత్న పెళ్లి
### కులం కాదు గుణం గొప్పదంటూ.. ఆచారాల కంటే రాజ్యాంగ విలువలకే ప్రాధాన్యం





**చిన్నంబావి జూన్ 25 (ప్రజాజ్యోతి)** చిన్నంబావి మండలంలోని గూడెం గ్రామంలో గురువారం జరిగిన ఓ వివాహం అందరి దృష్టిని ఆకర్షించింది. సంప్రదాయంగా పెళ్లిళ్లలో కనిపించే తాళి, సప్తపది, సింధూరం వంటి ఆచారాలకు దూరంగా ఉంటూ.. భారత రాజ్యాంగాన్ని సాక్షిగా చేసుకుని శివశంకర్, సౌమ్యలు దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టారు.సత్యశోధక్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వివాహంలో నూతన వధూవరులు భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి దండలు మార్చుకున్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ప్రదక్షిణలు చేస్తూ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం విలువలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు."కులం కాదు గుణం గొప్పది.. మతం కాదు మానవత్వం గొప్పది" అనే సందేశాన్ని తమ వివాహం ద్వారా సమాజానికి అందించాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ఎంచుకున్నామని నూతన దంపతులు తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సమాజంలో మార్పుకు తమ వంతు ప్రయత్నంగా ఈ ఆదర్శ వివాహాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.పెళ్లిళ్లలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్భాటాలకు పోవడం కంటే, నిరాడంబరంగా వివాహం చేసుకుని ఆ డబ్బును అవసరమైన వారికి ఉపయోగపడేలా చేయవచ్చనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వరుడు శివశంకర్ తెలిపారు.వివాహ వేడుకకు హాజరైన బంధువులు, గ్రామస్తులు, సామాజిక కార్యకర్తలు ఈ జంటను అభినందించారు. యువత రాజ్యాంగ విలువలను జీవితంలో ఆచరించి సమానత్వ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.గూడెం గ్రామంలో జరిగిన ఈ ఆదర్శ వివాహం ప్రస్తుతం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.సంప్రదాయాలకు భిన్నంగా రాజ్యాంగ విలువలను ముందుకు తెచ్చిన ఈ జంట పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# పార్టీ బలోపేతానికి నూతన కార్యాలయం దోహదం

### - 28న బీజేపీ నూతన జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం
### - పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: దుప్పల్లి నారాయణ



**వనపర్తి, జూన్ 25 (ప్రజాజ్యోతి):** వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరంలో ఆధునిక హంగులతో నిర్మించిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జిల్లా కార్యాలయాన్ని ఈ నెల 28న ఘనంగా ప్రారంభించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబిన్ వర్చువల్ విధానంలో ప్రారంభించనుండగా, ముఖ్య అతిథిగా ఏపీవీఎన్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు, జాతీయవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నూతన కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారం, సేవా కార్యక్రమాల నిర్వహణ, పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని దుప్పల్లి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, మాజీ రాష్ట్ర నాయకులు శ్రీశైలం, ఓబీసీ మోర్చా నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్, కొండోజు గోపీనాథ్, ఐటీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్ లూమ్ ఎక్స్ లెన్స్ సెంటర్ ను సందర్శించిన దాసరి హరిచందన





**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద నిర్మాణం పూర్తయిన హ్యాండ్ లూమ్ ఎక్స్ లెన్స్ సెంటర్ ను గురువారం కార్మిక,ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నారాయణ పేట జిల్లా ప్రత్యేక అధికారిణి దాసరి హరిచందన జిల్లా కలెక్టర్ ప్రియాంక తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సెంటర్ లో ఏర్పాటు చేసిన మగ్గాలను, చేనేత కార్మికుల యంత్రాలు, పరికరాలను ఆమె పరిశీలించారు. మాస్టర్ వీవర్స్ తో మాట్లాడారు. అరుణ్య ఆన్ లైన్ అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

# నారాయణపేట డిపోకు నూతన డిపో మేనేజర్‌గా శ్రీ రామ్ మోహన్ బాధ్యతల స్వీకరణ



**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)** నారాయణపేట డిపోకు నూతన డిపో మేనేజర్‌గా శ్రీ రామ్ మోహన్ గారు నియమితులయ్యారు. హకీంపేట్ డిపోలో విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన అనంతరం నారాయణపేట డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నారాయణపేట డిపోలో ప్రస్తుతం ఇన్‌చార్జి డిపో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ రాజయ్య గారి నుండి శ్రీ రామ్ మోహన్ గారు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, అధికారులు నూతన డిపో మేనేజర్ గారికి స్వాగతం పలికి, విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, సంస్థ అభివృద్ధికి కృషి చేయడం తన ప్రాధాన్యత అని నూతన డిపో మేనేజర్ రామ్ మోహన్ గారు తెలిపారు.

# రోడ్డు మధ్యలో నిలిపిన డీసీఎం డ్రైవర్ మృతి

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి)జూన్ 25:** జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి సమీపంలోని జాతీయ రహదారి-44పై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన కారు డ్రైవర్ టి. వెంకటేష్ (49) అక్కడికక్కడే మృతి చెందాడు.కుటుంబ సభ్యులు,పోలీసుల వివరాల ప్రకారం కర్నూలుకు చెందిన జంషెడ్ అహ్మద్‌కు చెందిన కారును నడుపుతూ హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తుండగా ముద్దూర్--బీచుపల్లి వంతెన సమీపంలో రోడ్డుమధ్యలో ఎలాంటి హెచ్చరిక సూచనలు లేకుండా నిలిపి ఉంచిన డిసిఎం వాహనం వెనుక భాగాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వెంకటేష్‌కు తల, ముఖం,ఛాతీ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు.కారులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలు కాగా, మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు టి. శివకుమార్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని రోడ్డుపై నిలిపివేయడం వల్లే ప్రమాదం జరిగిందని పేర్కొంటూ కేసు నమోదు చేశారు.ఘటనపై ఎఎస్ఐ సుధాకర్ దర్యాప్తు చేపట్టారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

## టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు



**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల పాఠశాలలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని అన్నారు. మత్తు పదార్థాల వ్యసనం కారణంగా విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా తమ లక్ష్యాలపై దృష్టి సారించాలని, మంచి విద్యతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ తోటి విద్యార్థులు, స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రులకు కూడా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని కోరారు.జిల్లా పోలీస్ శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ఎవరైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు లేదా వినియోగం చేస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.అదేవిధంగా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1933 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ పై అవగాహన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ 2 గాయత్రి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

## - డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ ఆదర్శ్ సురభి




**వనపర్తి ప్రతినిధి, జూన్ 25 (ప్రజాజ్యోతి):**
వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించిన కలెక్టర్, గతంలో డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమాలు నిర్వహించి దోమల వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్ బృందాలను చురుకుగా పనిచేయించాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగ్యూ నిర్ధారణ ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించి, జిల్లావ్యాప్తంగా రోజుకు 330 పరీక్షల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్‌గా తేలిన కేసులను వెంటనే తదుపరి నిర్ధారణ పరీక్షలకు పంపడంతో పాటు కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించాలని తెలిపారు. పాముకాటు చికిత్సకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అన్ని ఆసుపత్రుల్లో తగిన మోతాదులో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వంట చేసే సిబ్బందికి టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం నిర్ధారించాలని ఆదేశించారు. అలాగే క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు, ఎక్స్‌రేలు విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. గర్భిణులందరి రిజిస్ట్రేషన్, ఏఎన్‌సీ పరీక్షలు, స్కానింగ్‌లు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించిన కలెక్టర్, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి అవసరమైన చికిత్స, పోషకాహార సలహాలు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఇతర వైద్య అధికారులు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


# ఓటరు జాబితా సవరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## - ఎన్యుమరేషన్ ఫారం నింపి బీఎల్ఓకు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జూన్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
భారత ఎన్నికల సంఘం జూన్ 25 నుంచి జూలై 24 వరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గురువారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) నుంచి ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వీకరించి, తన వివరాలను నమోదు చేసి తిరిగి బీఎల్ఓకు అందజేశారు. రంగారెడ్డి గూడలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు బీఎల్ఓలకు అవసరమైన వివరాలు అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదై ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే బీఎల్ఓలు అత్యంత పారదర్శకంగా, నిష్పక్షికంగా, జాగ్రత్తగా ఈ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సవరణ ప్రక్రియలో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.
ప్రజలందరూ ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించి, అవసరమైన సమాచారం, పత్రాలను సకాలంలో సమర్పించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే తప్పులేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఎన్నికల శాఖ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వివాహ వేడుకకు హాజరైన జర్నలిస్టులు



**అలంపూర్ డివిజన్ ప్రజా (జ్యోతి) జూన్ 25:**
వడ్డేపల్లి మండలం జోగులాంబ గద్వాల గురువారంపైపాడు గ్రామంలో నిర్వహించిన వివాహ మహోత్సవానికి వివిధ పత్రికలు,ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు హాజరై రాజ్ కుమార్ కవితలనూ. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రాష్ట్ర దళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు కప్పోగు జాన్,రాజు,శాంతిరాజు, మద్దిలేటి,గోపాల్, నాగరాజు,ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ ఉద్యోగాల నియామకాల్లో ఇంటర్వ్యూ విధానాన్ని విరమించుకోవాలి

## టీఆర్ఎస్ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్



**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)**
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియలో 3,100 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు మరియు 12,882 అంగన్‌వాడీ సహాయకుల (హెల్పర్) పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించడం వల్ల పక్షపాతం, రాజకీయ జోక్యం మరియు అవినీతికి అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.అభ్యర్థుల విద్యార్హతలు, సాధించిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా పూర్తిగా మెరిట్ పద్ధతిలోనే ఎంపికలు చేపట్టాలని కోరారు. ఇంటర్వ్యూ విధానం వల్ల అర్హులైన మహిళలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, స్థానిక స్థాయిలో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ మహిళలు ఈ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పారదర్శకమైన విధానాన్ని అనుసరించాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపికలు నిర్వహిస్తే మాత్రమే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుందని అన్నారు.కాబట్టి ప్రభుత్వం 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేసి, విద్యార్హతలు మరియు మెరిట్ మార్కుల ఆధారంగా మాత్రమే నియామకాలు చేపట్టాలని టీఆర్ఎస్ నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)
నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని అపెక్స్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు పోలీస్ లు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మన్యం మాట్లాడుతూ విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అనుమానం స్వలంగా ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని అన్నారు, అలాగే డ్రగ్స్ ఎంజాయ్ సిగరెట్లు పట్ల కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు, విద్యార్థి దశ నుంచే అన్ని విషయాల మీద అవగాహన కలిగి ఉండడంతో సమాజం పట్ల గ్రామం పట్ల రాష్ట్ర పట్ల అవగాహన ఏర్పడుతుందని అన్నారు, విద్యార్థులు ముఖ్యంగా సెల్ఫోన్లు సిగరెట్లు గంజాయి డ్రగ్స్ గంజాయి ఆంటీ వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల మీద ఎప్పటికప్పుడు నిగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు, కార్యక్రమంలో సురేందర్ నాయక్ ,సత్యం గౌడ్ రాజేశ్వరి,కరెస్పాండెంట్ ప్రతాప్ హెడ్మాస్టర్ అనిత ఉపాధ్యాయులు ధర్మవతి ఎం అనిత మహేశ్వరి సునీత అనూష పాల్గొన్నారు



# ఆదర్శ్ పీజీ కళాశాలలో ఐ బిఎం - ఏఐ శిక్షణ కార్యక్రమం విజయవంతం

- విద్యార్థుల్లో కృత్రిమ మేధపై అవగాహన పెంపు
- భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు దోహదం



**మహబూబ్‌నగర్, జూన్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆదర్శ్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్‌లో నిర్వహించిన ఐ బి ఎం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జూన్ 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ బిఎం - ఏఐ ట్రైనర్లు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాథమిక అంశాలు, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, జనరేటివ్ - ఏఐ, అలాగే లింకెడిన్, గిట్ హబ్ వంటి వృత్తిపరమైన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై శిక్షణ అందించారు. అదనంగా సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. డిగ్రీ, ఎంబీఏ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విలువైన జ్ఞానాన్ని పొందారు. శిక్షణ కార్యక్రమం ద్వారా భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస అంశాలపై అవగాహన పెరిగిందని విద్యార్థులు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్. గౌలయ్య, కరస్పాండెంట్ బి. రాములు, కోఆర్డినేటర్ వి. అరుణ్ కుమార్ రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. ప్రభాకర్, ఎంబీఏ విభాగాధిపతి డి.వి. రాకేష్ జాదవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ రమేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహ్మద్ తాజుద్దీన్, మహ్మద్ అబ్దుల్ అఫ్జల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని కళాశాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

- రుద్ర జాగిలంతో హోటళ్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

**మహబూబ్‌నగర్, జూన్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు డీఎస్పీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ధర్మపూర్ గ్రామ పరిధిలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు డాగ్ స్క్వాడ్‌కు చెందిన రుద్ర జాగిలం సహాయంతో గ్రామంలోని పలు హోటళ్లు, షాపులు మరియు ఇతర వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమణారెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనకు నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ రమేష్, డాగ్ హ్యాండ్లర్ శంకర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే వంశీకృష్ణ మాటకు కట్టుబడి ఉండాలి..?

- అచ్చంపేటలో బిజెపికి స్థానమే లేదు
- రాబోయేది కెసిఆర్ పాలన -- హరీష్ రావు పర్యటనతో పార్టీలో మరింత జోష్
- మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్

**నాగర్ కర్నూల్ జూన్ 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉమ్మడి జిల్లాలో 14 సీట్లకు గాను బి ఆర్ ఎస్ పార్టీకి రెండు సీట్లు వచ్చిన... కాంగ్రెస్ కి 12 స్థానాలు వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అన్న మాటకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కట్టుబడి ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్ సవాల్ విశారారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేయకుండా రైతులను సామాన్య ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇక నూకలు చెల్లాయి. రెండున్నర ఏండ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచడంలో విఫలమయ్యారని స్పష్టం చేశారు . గత మూడు రోజుల క్రితం అచ్చంపేటకు ట్రిబుల్ షూటర్ మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన సందర్భంగా పార్టీలో మరింత జోష్ పెరిగిందని.. పార్టీ క్యాడరు స్థిరంగానే ఉందని, పార్టీ బలాన్ని చూసి అధికార పార్టీతో పాటు బిజెపి పార్టీకి చెమటలు పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు గెలవడం ఖాయమని హరీష్ రావు ప్రకటించడంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సవం నింపారు. పాలమూరు గడ్డపై బిఆర్ఎస్. అలాగే బిజెపి పార్టీకి నల్లమల్లలో అనగా అచ్చంపేట ప్రాంతంలో ఆదరణలేదని మొత్తంగా దక్షిణ తెలంగాణలో బిజెపి పార్టీ కేవలం మనుగడ కొనసాగించడమే. నల్లమల్ల గడ్డపై కాషాయపు జెండా ఎగరడం అనేది ఒక కలలాంటిదని ఎప్పుడైనా మూడో స్థానంలోనే బిజెపి ఉంటుంది. మాజీ ఎమ్మెల్యే పార్టీలో ఉన్నప్పుడు.. కనిపించని విపక్ష నేడు



విమర్శలు చేయడం తగదు. ఏది ఏమైనా అచ్చంపేటలో బిఆర్ఎస్ పార్టీ తిరిగి పుంజుకోవడంతోపాటు రాబోయే ఎన్నికల్లో అచ్చంపేట గడ్డపై టిఆర్ఎస్ జెండా ఎగరడం కాయమే. ఇటీవల ఒక సర్వే సంస్థ చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్ 47%, అధికార పార్టీకి 42% బిజెపి పార్టీకి ఒకటి కేవలం రెండు శాతం మాత్రమే ఆదరణ ఉందని ఆ సర్వే సంస్థ పేర్కొన్నది. ముమ్మాటికి మళ్లీ అధికారంలోకి రావడం కేసీఆర్ సీఎం కావడం ఎవరు కాదనలేని సత్యం అని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్ స్పష్టం చేశారు. భయభ్రాంతులకు గురికాకుండా పార్టీ పూర్వ వైభవం కొరకు నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు

# ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి

- అర్హులైన ప్రతి ఓటరు ఫారం పూరించి బీఎల్‌వోలకు అందజేయాలి
- ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, జూన్ 25 (ప్రజాజ్యోతి):**
భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గురువారం ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. పెద్దమందడి మండలంలోని మంగంపల్లి గ్రామానికి చెందిన బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఫారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని సక్రమంగా పూరించి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున, ఎన్నికల సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అయిజ ఇంచార్జ్ ఎస్ఐ గా కిరణ్ కుమార్



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 25:**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ గా ఏ.కిరణ్ కుమార్ బాధ్యతలు గురువారం స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,స్థానిక శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల సమస్యల పరిష్కారం, మరియు మండలంలో నేరాల నియంత్రణే ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : జూన్ 25 (ప్రజా జ్యోతి)**
తెల్కపల్లి మండలం కమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జగన్, భీముడు ఇద్దరు యువకులుబుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు.విషాదకర ఘటన పట్ల నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడం అత్యంత బాధాకరమని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి మనోధైర్యం కల్పించారు.అనంతరం ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అందే సహాయ సహకారాల విషయంలో అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు,కార్యకర్తలు,మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# తెలంగాణ నీళ్లపై పొరుగు రాష్ట్రాల కన్ను..!

**- రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్**
**- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ బ్యారేజీలు--రిజర్వాయర్లపై పోరాటానికి సిద్ధం.. కేసీఆర్‌తో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని మాజీ మంత్రి వెల్లడి**



**మహబూబ్‌నగర్, జూన్ 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేపడుతున్న కొత్త బ్యారేజీలు, రిజర్వాయర్ నిర్మాణాలు తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసే ప్రమాదం ఉందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే రైతులతో కలిసి ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.
మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కర్ణాటక ప్రభుత్వం నావలి వద్ద 50 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణాన్ని ప్రారంభించిందని, తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో రిజర్వాయర్లు, రహదారులు, వంతెనలు నిర్మిస్తూ నీటిని నిల్వ చేసుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ ప్రతిపాదనను సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే తుంగభద్ర, శ్రీశైలం, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టులకు నీరు వచ్చే అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటాయని, భవిష్యత్తులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కర్ణాటక పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి, మంత్రులు అక్కడ జరుగుతున్న బ్యారేజీలు, రిజర్వాయర్ల నిర్మాణాలు చూడలేదా అని ప్రశ్నించిన ఆయన, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్‌కు సమీపంలోనే బ్యారేజీ నిర్మాణం జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పులకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని ఆరోపించిన శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ రైతాంగానికి నష్టం కలిగించే ఏ చర్యనైనా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో చర్చించి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల చర్యలపై పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.
ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై నమోదైన కేసులను కూడా ఆయన ప్రస్తావిస్తూ, మేధావుల గొంతు నొక్కే ప్రయత్నాలను సహించబోమన్నారు. తెలంగాణకు సాగునీటి రంగంలో నష్టం కలిగించే వారిపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కొడంగల్ ప్రాజెక్టు వల్ల స్థానిక రైతులకు ఆశించిన ప్రయోజనం ఉండదని, మక్తల్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు నష్టం కలిగించే అవకాశం ఉందని ఆరోపించారు. పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రస్తుత ప్రణాళిక భవిష్యత్తులో సాంకేతిక సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. అలాగే ఊట్కూరు వాగులో అక్రమ ఇసుక రవాణా జరుగుతోందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కార్పొరేటర్లు ఈశ్వరయ్య, రమేష్ నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రొహిబిషన్ అధికారి వేణుగోపాల్ రెడ్డి

**-శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ : జూన్ 25 (ప్రజా జ్యోతి)**
నాగర్‌కర్నూల్ జిల్లా నూతన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా వి.వేణుగోపాల్ రెడ్డి గురువారం ఐడీఓసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ విధానాల అమలు, శాఖ పరిధిలో చేపట్టే చర్యలపై చర్చించి జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాల నియంత్రణతో పాటు మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రత్యేకచర్యలు చేపట్టాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో ఎక్సైజ్ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగానిర్వహించేందుకు కృషి చేస్తూ అక్రమ కార్యకలాపాల నిర్మూలన, ప్రభుత్వ ఆదాయ వృద్ధి, ప్రజలలో చట్టాలపై అవగాహన కల్పించడం, పారదర్శక పరిపాలన అందించడం తన ప్రధాన లక్ష్యాలని అన్నారు. అనంతరంఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా అభివృద్ధి శాఖ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పేద ప్రజలకు వైద్యాన్ని దూరం చేసిన ప్రభుత్వం, వెంటనే పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

**బిజెపి సీనియర్ రాష్ట్ర నాయకులు నాగరావు నామాజీ డిమాండ్**

**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా కేంద్రంలో హాస్పిటల్ సదుపాయాలు లేకపోవడం మరియు చిల్డ్రన్ హాస్పిటల్‌ను తొలగించడంపై బీజేపీ నాయకులు నాగురావు నామాజీ తీవ్ర ఆగ్రహం. వెంటనే ఆసుపత్రిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణానది జలాలు నారాయణపేట జిల్లాకు రావాల్సిన వాటాపై స్పష్టత లేదని, జిల్లాకు రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. మున్సిపాలిటీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, గ్రామ పంచాయతీలకు మరియు మున్సిపాలిటీలకు కేంద్ర నిధులు అందక సిబ్బంది జీతాల చెల్లింపులో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇవ్వాలని నామాజీ సూచించారు. బీజేపీలో భిన్నాభిప్రాయాలు సహజమని, ఇది వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా దేశం మరియు జాతీయవాదం కోసం పనిచేసే పార్టీ అని ఆయన స్పష్టం చేశారు. సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న ప్రధాని మోదీని విమర్శించే వారికి నైతికత లేదని ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు




## నూతన వధూవరులను ఆశీర్వదించిన అలంపూర్ ఎమ్మెల్యే



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 25:**
జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామంలో గురువారం రాజ్‌కుమార్ --కవితల వివాహ వేడుక ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం ఆనందమయం, సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు. అనంతరం పెండ్లి కుమారు యొక్క తల్లిదండ్రులు ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించడం జరిగింది.

## హజ్ యాత్రికులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి

**-హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్**



**నాగర్ కర్నూల్ : జూన్ 25 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా నుంచి 2027 లో హజ్ యాత్రకు వెళ్ళదలచిన యాత్రికులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ అన్నారు. జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో గురువారం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేఖ్ ఫరీద్ అహ్మద్ మాట్లాడుతూ ఆఫ్ లైన్ లో కాకుండా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని 2027 హజ్ యాత్ర కోసం ఆన్లైన్ దరఖాస్తులు జులై 20 వరకు చేసుకోవచ్చని పాస్ పోర్ట్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ జతపర్చాలని, ఆన్లైన్ దరఖాస్తుదారులు ఏమైన అనుమానాలుంటే నాగర్ కర్నూల్ జిల్లాహజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని, ప్రతి రోజూ ఉ :11-00 నుండి 1 గంట వరకు సంప్రదించవచ్చని జులై 20 వ, తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని, హజ్ యాత్రకు వెళ్ళదళిచినవారు పాస్పోర్టు వ్యాలిడిటీ 30 డిసెంబర్ 2027 వరకు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ హఖ్, కార్యదర్శి అలహాజ్ ఇబ్రహీం, అమీర్ అహ్మద్, ఎజాస్, జిల్లా ప్రచార కార్యదర్శి నూరుల్ హక్ పాల్గొన్నారు

## కన్యాకాపరమేశ్వరి ఆలయంలో 11వ,వార్షికోత్సవ పూజలు

**నాగర్ కర్నూల్ : 25 జూన్ (ప్రజా జ్యోతి)**
నాగర్ కరకర్నూల్ జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు ఆలయ కమిటీ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజయ్యల ఆధ్వర్యంలో 11వ, వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూలమూర్తికిమహాభిషేకం, ధ్వజారోహణం, గోపూజ, గణపతిపూజ, నిర్వహించారు. అనంతరం నవగ్రహ క్షేత్రపాలక వాస్తు మండప దేవతలను ఆహ్వానించి, ఉత్సవ మూర్తికి పవిత్ర జలాలతో కలశాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్యం మూలమంత్ర హోమం, నవగ్రహ పూజలు, కుంకుమార్చనలు, మహానీరాజనం సమర్పించి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్యులు మరియు దేవాలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

